విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 26 జూలై 2024 8 పేజీలు

ఒంగోలు డెయిరీ పునరుద్ధరించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

- ముఖ్యమంత్రి వద్దకు రాయబారానికి సన్నద్ధం
- పూర్వ వైభవానికి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలి
- సహకార రంగంలోనే ప్రభుత్వమే నిర్వహించాలి
- రూ.1000 కోట్ల విలువైన ఆస్తులకు రక్షణ కల్పించాలి
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్
- సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ



మాట్లాడుతున్న రామారావు

మాట్లాడుతున్న చుందూరి రంగారావు

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

విశాలాంధ్ర-ఒంగోలు : ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండవ పాల కేంద్రం ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి, ఒంగోలు డెయిరీ వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సీపీఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఒంగోలు డెయిరీని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుజ్జుల ఈశ్వరయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ 1975లో పాల సేకరణ కేంద్రంగా ప్రారంభమైన ఒంగోలు డైరీ 1994 కి రెండున్నర లక్షల లీటర్ల పాలు సేకరించి స్థాయికి ఎదిగింది అన్నారు. పాల రైతులు రూపాయికి రూపాయి కూడ పెట్టి ఒంగోలు డైరీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. 1987లో పాల్గొని కర్మాగారానికి శంకుస్థాపన కూడా జరిగిందన్నారు. కర్మాగార స్థలానికి పాల రైతులు రూ.19 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. డెయిరీ 2006 నాటికి రూ. 48 కోట్ల అప్పుల్లోకి వెళ్లిందన్నారు. దీంతో ఎన్‌డిడిబి దేవిని స్వాధీనం చేసుకొని 2012 నాటికి అప్పులు తీర్చి డైరీని లాభాల బాటలో నిలిపి వెళ్లిందన్నారు. 2014 వరకు లాభాల బాటలో నడిచిన డైరీని సహకార రంగం నుండి కంపెనీ యాక్ట్‌లోకి తీసుకుపోవటంతో తిరిగి డైరీ సంక్షోభంలో కూరుకు పోయిందన్నారు. ఆ తర్వాత కాలంలో వచ్చిన జగన్ ఏది పూర్తిస్థాయిలో విధ్వంసానికి

మిగతా 2 లో ...

డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పోరాటానికి సిద్ధం

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేందుకు సిద్ధమవ్వాలని పార్టీ శ్రేణులకు సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం బాపట్ల నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం కౌన్సిల్ సభ్యులు యాటగిరి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సింగరకొండ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటయింపులు ఏం చేయలేదని విమర్శించారు. కేవలం కార్పోరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా బడ్జెట్ ఉందన్నారు. 2014 ఏడాది కేటాయించిన బడ్జెట్‌లానే ప్రస్తుత బడ్జెట్ ఉందని మండిపడ్డారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందించలేదన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి అప్పు ఇప్పించే తామే ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ఎన్డీఏ కూటమి రాష్ట్రానికి కేటాయింపు ఏమి జరగకపోయిన ఇచ్చిన అప్పు చూసి

మిగతా 2 లో ...

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- 100 ఎకరాల్లో చెరువు నిర్మించడానికి ప్రతిపాదనలు
- కలెక్టర్ వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణ ప్రజలందరికీ శుద్ధ జలాన్ని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. బాపట్ల పట్టణంలోని పరిసర ప్రాంతాలలో కలెక్టర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, నూతన ఎస్ఎస్ ట్యాంక్ ప్రతిపాదిత స్థలం, శుద్ధ జల కేంద్రం, తాగునీటి సరఫరా విభాగం, మురుగునీటి కాలువలు, డంపింగ్ యార్డ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు, సంజయ్ గాంధీ కాలనీ, కలెక్టరేట్‌లోని పోలీస్ కవాతు మైదానం, తదితర ప్రాంతాలలో కలెక్టర్ కలియతిరిగారు. బాపట్ల ప్రజల తాగునీటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసు కుంటున్నామని జిల్లా కలెక్టర్ చెప్పారు. కొండుబొట్లపాలెం సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యం 860 మిలియన్ లీటర్ల కాగా ప్రస్తుతం ఎనిమిది అడుగుల మేర బురద మేట వేసిందన్నారు. 100 ఎకరాలలో విస్తరించి ఉన్న ట్యాంకులో పూడికతీత పనులు చేపట్టాలంటే ప్రత్యామ్నాయంగా రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు లేదన్నారు. సమీపంలోనే 100.8 ఎకరాల స్థలంలో చెరువు నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రైవేట్ స్థలం కొనుగోలు చేయడానికి రూ.14 లక్షలు అవసరమౌతాయని అంచనాలు వేశామన్నారు. పశ్చిమ కృష్ణ డెల్టా నుంచి నీరు విడుదలవుతున్నందున జిల్లాలోని తాగునీటి చెరువులన్నీ నింపుతున్నామన్నారు. మరో నాలుగు రోజుల్లో ట్యాంక్ పూర్తిగా నిండుతుందన్నారు. పట్టణ ప్రజలకు రెండు నెలలకు సరిపడా నీరు ఉందని, నీటి సరఫరాకు ఎలాంటి సమస్య లేదన్నారు. తదుపరి జల శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. జల శుద్ధి కేంద్రంలో కలియ తిరిగారు. కాపర్ సల్ఫేట్, బ్లీచింగ్ ప్రక్రియ, క్లోరినేషన్ ప్రక్రియ తదుపరి శుద్ధ జలం తయారీ విధానాలు, సరఫరా ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. 0.2 పిపిఎం ప్రకారం శుద్ధ జలాలను ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. ఆయన వెంట బాపట్ల ఆర్డిఓ జి రవీందర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ ఉన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర-ముండ్లమూరు : పోలీస్ స్టేషన్కు సమస్యలపై వచ్చే అర్జీ దారులతో మర్యాదగా నడుచుకుంటూ సమస్యలను తక్షణమే పరిష్కారం కోసం కృషి చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నేరనియంత్రణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. ట్రాన్స్ఫార్మర్ల దొంగతనంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పాత నేరస్థులపై దృష్టి సారించి ఫీడ్ యాక్ట్ అమలు చేయుటకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సిబ్బందికి ఏ సమస్యలు ఉన్న తనకు తెలియ జేయాలని, సాధ్యమైనంత వరకు వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.పోలీస్ స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ప్రతి ఒక్కరు డ్యూటీలో విధిగా యూనిఫామ్ ధరించాలని అన్నారు. డ్యూటీలో మందు సేవించినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో గేదెల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్ల యితే వారి కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. రికార్డులన్నీ సక్రమంగా ఉంచా లని సిబ్బందిని ఆదేశించారు. హెడ్ కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావు, పోలీసులు పి.పున్నారావు, ఎన్ బాబు, పి.మహేష్, బి ప్రేమనిధి, ఈ సూరిబాబు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు అనగా ఈ నెల 27వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల ప్రజా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మూరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో సుగుణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని అన్నారు. ఈ సమావేశానికి మండల జడ్పిటిసి సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పోరాటానికి సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

తాము సాధించాం ఇక తిరుగులేదు అని ఆకాశం వైపు చూడటం సిగ్గు చేటన్నారు. తాజా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో రెండు పథకాలకు పంగనామాలు పెడుతూ అసెంబ్లీలో ప్రకటించటం ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలన తెట తెల్లమైందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలెండర్ ఈ ఏడాదికి ఇవ్వలేనని ఆయా శాఖల మంత్రులు ప్రకటించటంపై సింగరకొండ మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటికే రెండు పథకాలకు ఇవ్వలేక చేతులెత్తేశారని మిగిలిన నాలుగు పథకాలు సక్రమంగా ఇస్తారా లేదా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుంటే సీపీఐ పార్టీ ప్రత్యక్ష ఉద్యమాలు చేయటానికి వెనకాడబోమని స్పష్టం చేశారు. బాపట్ల నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి బలోపేతం అయ్యే విధంగా పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, నియోజకవర్గ కౌన్సిల్ మెంబర్లు ముత్తిరెడ్డి శ్రీనివాస్, జె.రత్నకుమారి,సన్నమూరి శ్రీనివాసరావు, మామిడి బత్తుల ఆశోక్, వేణుగోపాల్‌రావు, ఎన్.అంజిరెడ్డి, ముత్తిరెడ్డి నాగేశ్వరావు, పసక రామాంజనేయులు టి.అంకమ్మరావు, పి.శ్రీను, తదితరులున్నారు.

వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తాం

మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర - ఒంగోలు : వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధాన మిచ్చారు. మంత్రి మాట్లాడుతూ... టీడీపీ హయాంలో దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రద్దు చేసి జగన్ రెడ్డి వారి పొట్ట కొట్టారని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులకు అడుగడుగునా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని మంత్రి చెప్పారు. ఎస్సీ ఎస్టీల కోసం నూతన పారిశ్రామిక విధానం అమలు చేయలేదని విమర్శించారు. బి మరియు సి కేటగిరి కింద మెడికల్ సీట్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయలేదన్నారు. అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులకు 41 సీఆర్పీసీ కింద స్టేషన్ బెయిల్ మంజూరు చేశారని అన్నారు. ఎస్సీలకు ఇళ్ల నిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.50,000/- అదనపు ఆర్థిక సహాయాన్ని కూడా నిలిపేశారని వివరించారు. ఉద్యోగాల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ చట్టం సక్రమంగా అమలు కాలేదు. ఎస్సీలకు పథకాల అమలులో ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎస్సీ నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా ఉన్న అమరావతి రాజధాని నిర్మాణం నిలిపేశారని మంత్రి పేర్కొన్నారు. దళితులకు మేనమామ అని చెప్పుకునే జగన్ రెడ్డి కంసమామలా మారి వారికి ద్రోహం చేశారని అన్నారు. అందుకే దళితులు తిరగబడి రాష్ట్రంలో వైసీపీని తరిమి కొట్టారని అన్నారు. గత టిడిపి హయాంలో దళితులకు అన్ని విధాల మేలు చేశామని మంత్రి అన్నారు. 2014 - 2019 లో ఐఎస్ బి సెక్టార్, పశుసంవర్ధక శాఖ కింద బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా 60 శాతం సబ్సిడీతో రూ.2716.70 కోట్లతో 2,02,414 మంది ఎస్సీలకు ప్రయోజనం చేకూర్చామని తెలిపారు. భూమిలేని పేదలకు భూమి కొనుగోలు పథకం ద్వారా రూ. 197 కోట్లతో 2,518 మందికి 2360.77 ఎకరాల భూమి పంపిణీ చేశామని, ఎన్ఎస్ఎఫ్‌డిసి కింద రూ. 552.55 కోట్లతో 10,634 మంది ఎస్సీ యువతకు ఇన్నోవా కార్లు, రవాణా రంగంలో అధిక విలువ గలిగిన ప్రాజెక్ట్ ఆధారిత యూనిట్లు అందించామన్నారు.

కానీ జగన్ రెడ్డి మాత్రం ఆ పథకానికి అంబేద్కర్ పేరు మార్చి తన పేరు పెట్టుకుని అంబేద్కర్ నే అవమానించారని అన్నారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలన్నీ త్వరలోనే తిరిగి పునరుద్ధరిస్తామని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

ఠాగూర్ సాంస్కృతిక సముదాయాల పనితీరుపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : దేశంలోని ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఠాగూర్ సాంస్కృతిక సముదాయాల ప్రస్తుత వాటి పనితీరు, క్రొత్త వాటి ఏర్పాటు మరియు అథారిటీ నియామకం గురించి ప్రభుత్వ చర్యలపై ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దీనికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ (స్వతంత్ర) సహాయక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానమిస్తూ ఈ పథకం క్రింద సంగీతం, నృత్యం, నాటకం, సాహిత్యం, లలిత కళలు మొదలగు సాంస్కృతిక రంగాలలో ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచే లక్ష్యంతో ప్రవేశపెట్టబడిందని, దేశంలో ఈ పథకం క్రింద గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రాల నుండి 26 ఠాగూర్ సాంస్కృతిక సముదాయాల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయని, అందులో ఆర్థిక సహాయం పొందినవి 8 పనిచేయుచున్నాయని, మరియు తిరుపతిలో దీని ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వచ్చిన ప్రతిపాదనలు సిఫార్సు చేసి ఆమోదించవలసివున్నదని తెలిపారు. ఈ పథకం క్రింద ప్రస్తుతం వున్నరబీంద్ర భవనాలను పునరుద్ధరణ, పునర్నిర్మాణం, స్థాయి పెంపు, ఆధునీకరణ, విస్తరణ వంటి పనులు మరియు రాష్ట్రాల రాజధానులలో మరియు ముఖ్య పట్టణాలలో క్రొత్తవాటి నిర్మాణం చేయబడునని తెలిపారు. పూర్తి ప్రతిపాదనలతో వచ్చిన ప్రాజెక్టులను మాత్రమే మంత్రిత్వ శాఖ పరిగణలోకి తీసుకొంటుందని, ఉప కమిటీ సాంకేతిక పరిశీలన అనంతరం వాటిని జాతీయ మూల్యాంకన కమిటీ ఆమోదించునని తెలిపారు.వీటి ఏర్పాటు-పనితీరుపై ఒక అథారిటీ నియామకంపై ఎలాంటి ప్రతిపాదనలు ప్రభుత్వం దగ్గర లేవని, కాని భౌతిక తనిఖీలు చేయుటకు ఈ పథక మార్గదర్శకాలు వుపయోగపడునని కేంద్ర మంత్రి తెలియజేశారు.

ఒంగోలు డెయిరి పునరుద్ధరించాలి

(మొదటిపేజీ తరువాయి)

సన్నద్ధం చేశారు అన్నారు. డైరీని అమూల్‌కు అప్పగించారన్నారు. లీటర్కు నాలుగు రూపాయలు అదనంగా రైతులకు ఆదాయం ఇప్పిస్తామని జిల్లాలోని అధికార యంత్రాంగాన్ని పాల రైతుల వద్దకు తిప్పించారన్నారు. అయితే నిర్వహణ సరిగా లేని అమూల్ పూర్తిస్థాయిలో చేతులు ఎత్తివేసింది అన్నారు. పాల సేకరణ 3000 లీటర్లకు పడి పోయింది అన్నారు.

మరోపక్క పాలపొడి ఫ్యాక్టరీ లోని యంత్రాలు, ఇతర ప్రాసెసింగ్ యంత్రాలు మూలనపడి తుప్పు పట్టాయన్నారు. ఒకప్పుడు జిల్లాలోని పాడి రైతులకు జీవనాధారంగా ఉన్న ఒంగోలు డైరీ పునః ప్రారంభం కోసం జిల్లా పాడి రైతులు ఎదురు చూస్తున్నారు అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఒంగోలు డైరీకి తగిన నిధులు కేటాయించి, సహకార రంగంలోని ఒంగోలు డైరీ ని ప్రభుత్వ నిర్వహించాలని కోరారు. అందు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు రాయ వారానికి సన్నద్ధమవు తున్నట్లు పేర్కొన్నారు.

కంపెనీ యాక్ట్‌లోకి పోయిన నాటి నుంచే సంక్షోభంలోకి

- ఒంగోలు డెయిరీ పూర్వాధ్యక్షులు రామారావు

ఒంగోలు డైరీ పూర్వాధ్యక్షులు రామారావు మాట్లాడుతూ డైరీ సహకార సంఘం నుండి కంపెనీ యాక్ట్‌లోకి పోయిన నాటి నుండి పరిపాలనంత కేవలం వ్యక్తుల చేతుల్లోకి పోయి పూర్తి స్థాయిలో నాశనమైందన్నారు. అందరిలోనూ జవాబు ఉండా అధికరణం కరువైందన్నారు. కంపెనీలని 192 మంది ఉద్యోగులతో పాటు 423 సొసైటీలతో, అందులో పని చేసే ఉద్యోగులతో పాటుగా జిల్లా వ్యాప్తంగా 1500 మంది పాలరైతే కుటుంబాలకు ఉపాధి చూపిన డైరీని నాశనం చేయటంలో పాలకుల హస్తం కూడా ఉందన్నారు. గతాన్ని మరచి ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలోని పాల రైతాంగానికి ఉపాధి చూపేలా వెంటనే ఒంగోలు డైరీని ప్రభుత్వమే నిర్వహించేలా ప్రభుత్వం ఒంగోలు డైరీ ని ప్రారంభించాలని కోరారు.

డైరీని సహకార రంగంలోనే ఉంచాలి

- ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య

ఆచార్య రంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఒంగోలు డైరీ ని సహకార రంగంలోనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అమూల్ డైరీ కూడా గుజరాత్లో సహకార రంగంలో, దేశవ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో ఉందన్నారు. సహకార రంగంలో ఉంటే ఏకపక్ష నిర్ణయాలు జరగవు అన్నారు. ఒంగోలు డైరీ జిల్లాలోని పాల రైతులకు జీవనాధారం అన్నారు.

రైతాంగ ఐక్యఉద్యమాల ద్వారానే సాధించుకోగలం

- సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు

సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ఒంగోలు డైరీ సహకార సంఘం నుండి కంపెనీ యాక్ట్‌లోకి పోయేనాటి నుండి అనేక రూపాలలో ఉద్యమాలు నిర్మించామన్నారు. ఏ సంఘానికి ఆ సంఘం విడివిడిగా చేయడం వల్ల పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం రాబట్ట వచ్చున్నారు. ఇప్పటికైనా అన్ని రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు జిల్లావ్యాప్తంగా ఉన్న పార్టీ రైతులను ఐక్యం చేసి వారికి అవగాహన కల్పించి, ఉద్యమంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. అప్పుడు మాత్రమే విజయం సాధించవచ్చు అన్నారు.

ఒంగోలు జిల్లాలోని పాలరైతుల కష్టార్జితం

- సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఒంగోలు డైరీ పరిధిలోని పాల రైతులు రూపాయికి రూపాయి కూడా పెట్టుకుని ఏర్పాటు చేసుకున్నా ఒంగోలు డైరీ ఆస్తుల పరిరక్షణ ప్రభుత్వం తీసుకోవాలన్నారు.

ప్రభుత్వం వెంటనే తగిన నిధులు కేటాయించి ఒంగోలు డైరీ పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని పాలరైతులకు జీవనాధారం

- సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి

సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ నాడు పొగాకు రైతుల పై కాల్పులతో సంక్షోభం, మరోపక్క తెల్ల దోమతో పత్తి సాగుతో అపారమైన నష్టాల్లో కూరుకుపోయిన రైతాంగానికి పాల సేకరణ జిల్లా రైతాంగానికి జీవనాధారం అయింది అన్నారు. ఒంగోలు డైరీ పునరుద్ధరణ ఉద్యమాన్ని రైతాంగ ఉద్యమంగా మార్చాలన్నారు. ప్రతి రైతాంగ కుటుంబం ఇంట్లోకి ఉద్యమ పరిస్థితులు తీసుకువెళ్లాలన్నారు. అప్పుడే దీనిని సాధించుకోవచ్చు అని పేర్కొన్నారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఇంకా సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టి పాటి వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు,ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, సిపిఐ ఎంఎల్ నాయకురాలు ఎస్ లలిత కుమారి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వల్లం రెడ్డి రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ ప్రకాశం' లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్

విశాలాంధ్ర-ఒంగోలు : వికసిత ప్రకాశం లక్ష్యంగా జిల్లాలో బిజెపి పని చేస్తుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. ఒంగోలులోని హోటల్ సరోవర్‌లో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మద్దులూరి ఆంజనేయులు అధ్యక్షతన బిజెపి మీడియా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దినకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గతంలో ఎన్నడు లేని విధంగా అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. అంతేకాకుండా వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాలో చేర్పించడంలో బిజెపి రాష్ట్ర కమిటీ పూర్తిస్థాయిలో సఫలం అయింది అన్నారు. వికసిత ప్రకాశం జిల్లా తోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది అన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు బాధ్యతాయుతంగా జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించి నిధులు రాబట్టుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. తమ వద్ద ఉన్న సమాచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోయి జిల్లా తో పాటుగా రాష్ట్ర అభివృద్ధి డబుల్ ఇంజన్ రైలు స్థాయిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. జిల్లాలో నిలిచిపోయిన దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్, కనిగిరి నిమ్జ్, తో పాటుగా ఒంగోలుకు ప్రతిరోజు తాగునీరు అందించే దిశగా అమృత్ 3 నిధులు రాబట్టుకునేందుకు ఇదే సరి అయిన సమయం అన్నారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయటం ద్వారా దొనకొండ ఇండస్ట్రియల్ క్యారిడారుకు, కనిగిరి ని మ్జ్ కు నీరు అందించడమే కాకుండా, భూగర్భ జలాలు పెంపుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా రానున్న కాలంలో ప్రధానమంత్రి నివేశిత యోజన పథకంలో భాగంగా జిల్లాలో పేదలకు మరిన్ని గృహాలు ఏర్పాటు చేసుకోవచ్చు అన్నారు. మరో ఐదు సంవత్సరాలు పాటు ప్రతి ఇంటికి 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. పశ్చిమ ప్రకాశం అభివృద్ధి లో భాగంగా మార్కాపురం కేంద్రంగా పశ్చిమ ప్రకాశం జిల్లా ఏర్పాటుకు బిజెపి కట్టుబడి ఉందన్నారు. తూర్పు ప్రకాశం జిల్లాలో అద్దంకి, కందుకూరు నియోజకవర్గం కలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోతామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ గా అభివర్ణించారు. రాష్ట్రంలో రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం అవుతాయని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

జేపీ రాజ్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి నియోజకవర్గంలోని సిఎస్ పురం మండలంలో పెద్ద చెర్లోపల్లి గ్రామంలో సిఎస్ పురం మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు బలభద్ర శీను మాదిగ మహజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులు నేదర్ పల్లి బెంజిమెన్ మాదిగ వీరి ఆధ్వర్యంలో మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు పెద్ద చెర్లపల్లి గ్రామంలో గ్రామ పెద్దల చేతుల మీదగా ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్షులుగా కనిగిరి ఎమ్మార్పీఎస్ కోఇంచార్జ్ జేపీ రాజు మాదిగ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మాదిగల లక్ష్యం ఎస్సీ వర్గీకరణ తీర్పు అతి త్వరలోనే రాబోతున్న సందర్భంగా ప్రస్తుతం మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు అన్ని గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండాలు నిర్మించుకోవాలని గ్రామ కమిటీలు మరియు మండల నిర్మాణంతో పాటు జండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఆగస్టు నెలాఖరుకల పూర్తి చేయాలని కోరారు. మాదిగ జాతి లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిలో నిమగ్నం అవ్వాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నేదర్ పల్లి పోలయ్య మాదిగ గొల్లపల్లి దేవ సహాయం నాదర్పల్లి వెంకటయ్య గొల్లపల్లి అంకయ్య ఇమ్మానియేలు మామిడి పుల్లయ్య, అంగలకుర్తి ఇమ్మానియేల్ మాదిగ దేవ మాదిగ వెంకటయ్య మాదిగ వెంకటాద్రి గొల్లపల్లి ఏసేపు నేదర్ పల్లి దానియలు మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సచివాలయానికి కంప్యూటర్ బహూకరణ

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు బీసీ కాలనీ సచివాలయం 3 లో గత కొన్ని నెలలుగా కంప్యూటర్లు మొరాయించాయి. దీంతో పలు సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు గమనించి ప్రముఖ పారిశ్రామికవేత్త టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు తన సొంత నిధులతో సచివాలయానికి కంప్యూటర్ బహుకరించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ గత కొన్ని నెలుగా మా విధులను నిర్వర్తించడానికి కంప్యూటర్ మరమ్మత్తుల కారణంగా ఇబ్బందులు పడ్డామని తెలిపారు. సచివాలయ సిబ్బందితో పాటు సచివాలయ పరిధిలో ఉన్న ప్రజలకు సైతం ప్రభుత్వ సేవలు అందించడంలో ఇబ్బందులను గమనించిన బెల్లం జయంత్ బాబు కంప్యూటర్ సచివాలయానికి బహు కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నం వెంకటేశ్వర్లు అరికట్ల వెంకటస్వామి రమేష్ దామచర్ల శ్రీధర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఎస్పీ ఏఆర్ దామోదర్

విశాలాంధ్ర - ఒంగోలు : దర్శి సబ్ డివిజన్, దర్శి సర్కిల్ పరిధిలోని తాళ్ళూరు, ముండ్లమూరు, దర్శి పోలీస్ స్టేషన్ లను మరియు ఒంగోలు సబ్ పరిధిలోని చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లను గురువారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించి పోలీసు స్టేషన్‌లోని లాకప్, రిసెప్షన్, కంప్యూటర్ రూమ్, జి.డి మరియు రికార్డుల నిర్వహణ, పోలీసు స్టేషన్ పరిసరాలను, వివిధ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలన్నిటిని పరిశీలించారు. పని చేయుచున్న సిబ్బంది వివరాలు, వారి విధి నిర్వహణ పని తీరు గురించి ఆరాతీశారు. ప్రతి స్టేషన్ ఆవరణను పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్ ఫైల్స్ ను తనిఖీ నిర్వహించి పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని, స్టేషన్ రికార్డ్స్ అన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. మహిళలు,పిల్లలు భద్రత విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, అలాగే నేరాలను అరికట్టేందుకు గస్తీ ముమ్మురం చేయాలని, అసాంఘిక చర్యలపై ఉక్కుపాదం మోపాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు విజబుల్ పోలీసింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా మరియు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో బీట్లు తిరిగే సమయంలో చెడునడత/హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాలలో విధిగా పర్యటించాలని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని,ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ప్రజలకు సీసీ కెమెరాల పై అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, అలాగే సైబర్ నేరాల పట్ల, సైబర్ నేరగాలు చూపే మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది యూనిఫామ్ నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, సిబ్బందికి ఏమన్నా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట తాళ్ళూరు ఎస్సై విజయకుమార్, దర్శి ఎస్సై సుమన్, చీమకుర్తి ఎస్సై వెంకట కృష్ణయ్య, చీమకుర్తి సిఐఎస్సై రాజమోహన్ రావు ఉన్నారు.

రేపటి నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నేటి నుండి గ్రామాలలో విచారణ చేపట్టడం జరుగుతుందని ఏపీవో కే నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుండి 2024 మార్చి 31 తేది వరకు గ్రామాల్లో చేపట్టిన అన్ని పనులకు సంబంధించి కొలతలు కొలిచి, కూలీల మస్టర్లను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో గ్రామసభలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభ ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు.

పురపాలక సంఘ కార్యాలయము, రేపల్లె

ఆర్.ఓ.సి.నెం.158/2022/A2 **తేది : 25-07-2024**

బహిరంగ వేలము నోటీసు

రేపల్లె పురపాలక సంఘము యాజమాన్యమునకు చెందిన వివిధ మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి **25** సంవత్సరముల లీజు కాలపరిమితి పూర్తి అయిన షాపు రూములను లీజుకిచ్చుటకు గాను **ది.02-08-2024**న శ్రీయుత కమీషనరు గారిచే గాని / వారి అనుమతి పొందిన వారిచే గాని **2024-2025** గజిట్ నోటిఫికేషన్ షరతుల మేరకు బహిరంగ వేలము నిర్వహించబడును. కావున పాటలో పాల్గొను వారు ఎస్.సి, ఎస్.టి షాపులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రముతో పాటలో పాల్గొనవలయును. ఇతర వివరములు ఈ కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కమిషనరు
రేపల్లె పురపాలక సంఘము

పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరణ

పట్టణంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన వ్యర్థాలు

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలంలో 30 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారం రోజుల నుంచి పారిశుద్ధ్య కార్మికులు విధులను బహిష్కరించారు. దీంతో పట్టణంలో ఎక్కడికి అక్కడ చెత్త చెదారాలు వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో ప్రజలు స్థానికంగా సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ సెక్రెటరీ జీతాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించారని అంతేకాకుండా పంచాయతీలో రికార్డులు మాయం కావడంపై పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజుల నుంచి పంచాయతీ సెక్రెటరీ విధులకు హాజరు కాకుండా సెలవుపై వెళ్లడంతో ఉన్నత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విధులకు హాజరు కాకపోతే సస్పెన్షన్ చేస్తామని పంచాయతీ సెక్రెటరీని హెచ్చరించారు. ఉన్నతాధికారులు హెచ్చరించిన పంచాయతీ సెక్రెటరీ విధులకు హాజరు కాలేదు. పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అన్నా క్యాంటీన్‌పై తాడిపర్తి చంద్రశేఖర్ అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : అన్నా క్యాంటీన్ మీద ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాడిపర్తి చంద్రశేఖర్ అన్న క్యాంటీన్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని, దోర్నాల మండల టిడిపి మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి, టిడిపి నాయకులు, పేద ప్రజల ఉద్దేశించి అన్నా క్యాంటీన్ల గురించి మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రమైన దోర్నాలోని టిడిపి పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజకవర్గంలో గుర్తింపు లేకపోవడంతోనే అన్నా క్యాంటీన్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు అన్నది నూటికి నూరు శాతం నిజం అనిపిస్తుంది. తాటిపర్తి గుర్తింపు కోసం అన్నా క్యాంటీన్ గురించి ఎంతకైనా దిగజారి మాట్లాడతారా అని తెలియజేశారు. అసెంబ్లీ జరుగుతుంటే దుమ్మా కొట్టి నియోజకవర్గ సమస్యలు, వెలుగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడేది లేకుండా అన్న క్యాంటీన్‌లో భోజనం గురించి, పేద ప్రజల చులకగా మాట్లాడటం మంచిది కాదని, పేద ప్రజలకు క్షమాపణ చెప్పాలని టిడిపి నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బట్టు సుధాకర్‌రెడ్డి, దొడ్డ శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, చెన్నరెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని మొగుళ్ళూరు సచివాలయాన్ని ఈవోపీఆర్డి తాతపూడి సుకుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతిరోజు సచివాలయానికి తప్పకుండా రావాలని ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం శానిటేషన్‌కు సంబంధించిన మెటీరియల్ పంపిణీ చేశారు. ఓడిఎఫ్ సర్వే పై సమీక్ష నిర్వహించారు. ఓడిఎఫ్ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలను సమర్థవంతంగా పంపిణీ చేయాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-పుల్లలచెరువు : సాగర్ జలాలను తాగునీటి అవసరాలు తీర్చేలా సమర్థంగా పంపిణీ చేయడంపై దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు స్పష్టం చేశారు. సాగర్ జలాలతో నింపుతున్న పుల్లలచెరువు మండలం ముటుకులలోని సమ్మర్ స్టోరేజీ చెరువును గురువారం ఆమె సందర్శించారు. సి.పి.డబ్ల్యు.ఎస్ పంపు హౌస్, మైక్రో ఫిల్టర్లు, క్లోరినేషన్ సంపు, ఇతర విభాగాలను ఆమె పరిశీలించారు. ఈ నీటి పంపిణీ జరిగే గ్రామాల వివరాలను, పంపిణీ విభాగ నిర్వహణ వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ చెరువు నీటిని 23 గ్రామాలకు సరఫరా చేస్తామని ఆర్.డబ్ల్యు.ఎస్. సూపరింటెండెంట్ ఇంజనీర్ మర్దన్ అలీ ఆమె వివరించారు. ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా తమ గ్రామానికి నీరు అందిస్తున్నారని, అయితే గ్రామంలో అంతర్గత పైపులైన్లు అందుబాటులోకి ఇంకా రాలేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా అంతర్గత పైపులైన్ల ఏర్పాట్లకు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదని, ఈ పథకం 2027 మార్చి వరకు ఉంటుంది కనుక పైప్ లైన్లు వేసే పనులను కూడా పూర్తి చేసేలా చూస్తామని మర్దన్ అలీ వివరించారు. స్టోరేజీ చెరువులోకి పశువులు దిగకుండా దాని చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పూర్ణచంద్రరావు, ఆర్డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీధర్రావు, డి.ఈ.ఈ. నవ కిషోర్, జే.ఈ. రామకృష్ణ ఇతర అధికారులు ఉన్నారు.

నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి :

ముటుకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ ప్రాంగణంలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను ఆమె పరిశీలించారు. వివిధ తరగతులలోని విద్యార్థులతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠ్య పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో వాటిని చదివించి వారిలోని విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. తరగతుల స్థాయికి తగినట్లుగా వారిలో విద్యా ప్రమాణాలు లేకపోవడంతో టీచర్లపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలోని వంటగదిని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనంలో భాగంగా సిద్ధం చేసిన పులిహోరను కలెక్టర్ ప్రత్యేకంగా తిని దాని రుచిని పరిశీలించారు. పులిహోర రుచికరంగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు వాటి రుచిని, నాణ్యతను ప్రధానోపాధ్యాయులు కచ్చితంగా పరిశీలించాలని ఆమె ఆదేశించారు. విద్యార్థులు ఎవరూ బడి మానివేయకుండా చూడాలని టీచర్లకు ఆమె దిశా నిర్దేశం చేశారు. పాఠశాలలోని మొత్తం విద్యార్థులు, టీచర్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. తగిన సంఖ్యలో ఈ పాఠశాలకు టీచర్లు లేరని స్థానికులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఈ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని ఆమె హామీ ఇచ్చారు.

అపరిమిత వినియోగాన్ని అరికట్టాలి :

పరిమితికి మించి భూగర్భ జలవనరుల వినియోగాన్ని అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముటుకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, కలవకుంట గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోనూ ఏర్పాటు చేసిన పీజో మీటర్లను ఆమె పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో భూగర్భ జల నీటి మట్టం వివరాలను వీటి ద్వారా తెలుసుకునే విధానాన్ని అధికారులు ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. జిల్లాలో అధిక భూగర్భ నీటి వినియోగ గ్రామాలు 57 ఉన్నాయని వారు చెప్పగా, పరిమితికి మించి భూగర్భ జల వినియోగం జరగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ నీటిమట్టం పెరిగేలా చూడాల్సి ఉన్నదని, ఈ విషయంలో డ్వామా ఆధ్వర్యంలో చేపట్టే నీటి సంరక్షణ పథకాలపై మరింత దృష్టి సారించి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నదని అన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడంపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా భూగర్భ వనరుల శాఖ అధికారి విద్యాసాగర్, ఇతర అధికారులు ఉన్నారు.

కొత్తచెరువు సమస్య పరిష్కారానికి కృషి

మండల పరిధిలోని కొత్తచెరువును కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో కంభం చెరువు తర్వాత ఇదే పెద్ద చెరువు అని, సుమారు రెండు వేల ఎకరాలు ఈ చెరువు కింద సాగు అవుతున్నాయని స్థానికులు ఆమెకు వివరించారు. సుమారు రెండేళ్ల క్రితం ఈ చెరువుకు గండి పడిందని, తాత్కాలికంగా మరమ్మతులు చేశారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. తాగునీటి కొరత ఉన్న గ్రామాలకు ఇక్కడి నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా అవుతున్నట్లు కూడా వారు తెలిపారు. ఈ చెరువులో నీరు నిలిచేలా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చర్యలు తీసుకుంటే తమకు సాగునీటికి ఇబ్బంది ఉండదని స్థానికులు చెప్పగా, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డి.ఎల్.డి.వో. సాయికుమార్, స్థానిక అధికారులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

కాంగ్రెస్ నేత పుట్లూరి కొండారెడ్డి

విశాలాంధ్ర-దర్శి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పుట్లూరి కొండారెడ్డి అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి మాట్లాడక పోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తూ ఉంటే కనీసం ఈ బడ్జెట్‌లో నైనా ప్రత్యేక హోదా కల్పిస్తారని ఆశించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చక్రం తిప్పుతారని అనుకొన్నాం. కానీ అక్కడ ఆయన కృషి ఫలించలేదని కొట్టి పారేశారు. బీజేపీ పూర్తిగా మన రాష్ట్ర ఎంపీలపై ఆధార పడినప్పటికీ ప్రత్యేక హోదా రాలేదని విమర్శించారు. అలాగే విభజన హామీలలో ఉన్న విశాఖ రైల్వే జోన్ ప్రస్తావన లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తేవాలని, కేంద్రం అంగీకరించని పక్షంలో టీడీపీ మద్దతును ఉప సంహరించాలని పుట్లూరి కొండారెడ్డి డిమాండు చేశారు. మోడీ తిరుపతి వేంకటేశ్వర స్వామి వారి ఆలయం ఎదురుగా చేసిన వాగ్దానంపై స్పందించాలని ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను పదేళ్ల పాటు ఇస్తానని ప్రగల్భాలు పలికారని, ఆ హామీ అమలు చేయాలని పుట్లూరి కొండారెడ్డి డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు కావాలన్న, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవాలన్న కాంగ్రెస్ తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం కర్నా పుల్లా రెడ్డి వల్లెపు శంకర్. దాసరి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

15న అన్నా క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు

కలెక్టర్ వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : అన్నా క్యాంటీన్‌లు వచ్చే నెల 15 నుంచి తెరిచేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. అన్నా క్యాంటీన్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. గత అనుభవాలపై స్థానిక ప్రజల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేదల ఆకలిని తీర్చే బృహత్తరమైన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని తెలి పారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పడ గానే రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకా రం చేసే సమయంలో అన్నా క్యాంటీ న్లు పునరుద్ధరిస్తామని ప్రకటించా రన్నారు. తక్షణమే అమలుపరిచేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి చర్యలు తీసుకుంటున్నా రన్నారు. ఆకలితో అలమటించిపోయే నిరుపేదలకు కేవలం ఐదు రూపా యలకే కడుపునిండా భోజనం పెట్టాలని ఉద్దేశించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అన్నా క్యాంటీన్లు జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి పట్టణ ప్రాంతాలలో పునరుద్ధరించనున్నట్లు వివరించారు. ఆగస్టు రెండో తేదీ నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి ప్రారంభానికి చర్యలు తీసుకుంటా మన్నారు. స్వాతంత్ర దినోత్సవం నుండి ఐదు రూపాయలకే భోజనం ఇచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నా యన్నారు. బాపట్ల పట్టణంలోనే గ తంలో సుమారు 500 మంది భోజ నం చేసేవారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సహకారంతో మరింత మందికి నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

ఆయన వెంట బాపట్ల ఆర్డీఓ జి రవీందర్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్ కుమార్, డి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

వైద్యానికి రోటరీ చేయూత

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని అన్నంభోట్లవారిపాలెంకు చెందిన మానం శివరామకృష్ణ ప్రసాద్ అనారోగ్యంతో వైద్య ఖర్చుల కోసం సహకారం అందించాలని గ్రామానికి చెందిన దొడ్డా వెంకటరావు రోటరీ దృష్టికి తీసుకెళ్ళారు. సమస్యపై స్పందించిన రోటరీ ప్రతినిధులు మానంకు గురువారం రూ.50 వేలను అందించారు. అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలని రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ ఆకాంక్షించారు. మానం కుటుంబ సభ్యులు రోటరీ వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు కోటా శ్రీనివాసరావు, సదానందరెడ్డి, ఎన్ శ్రీనివాసరావు, సర్పంచ్ నెల్లూరి అనంతమ్మ ఉన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను కొనసాగించాలి

విశాలాంధ్ర-పర్చూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి క్రమశిక్షణతో కూడిన విద్యను కొనసాగించాలని జవహర్ నవోదయ పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు పి.సాంబయ్య తెలిపారు. స్థానిక వైజర్ ఉన్నత పాఠశాలలో గురువారం వర్తమాన అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ప్రధానో పాధ్యాయుడు ఈదర రాజశేఖర్,ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర-పర్చూరు: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ అప్పారావు తెలిపారు. కారంచేడులోని మహిళా సమైక్య కార్యాలయం నందు గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన నిరంతర ఆదాయం సమకూరుతుందని, భూమి సారవంతంకు నవధాన్య పచ్చిరొట్ట ఉపయోగించాలని తెలిపారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయు విధానంను, అమృతాలు, కషాయాల ఉపయోగాలను సోదోహరణంగా విశదీకరించారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన్, మండల మహిళా అధ్యక్షురాలు సుధారాణి, సీసీలు ఇస్సాకు, అశోక్, వేణు, వీఓఏ సుమలత, ఎన్‌పి సిబ్బంది శిరీష, అంజలి, రామయ్య ఉన్నారు.

సమస్యలు పరిష్కారంలో ఎస్టీయూ ముందంజ

విశాలాంధ్ర - చీరాల : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ముందంజలో ఉందని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వి.ప్రభాకర రావు అన్నారు.గురువారం చీరాల పట్టణంలోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్య క్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర రావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేసిన జీవో 117 ను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా కొనసాగించా లని,మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు బదిలీలు నిర్వహించాలని, ఉపాధ్యాయులపై భారం తగ్గించా లని, అవసరం ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయు లను సర్దుబాటు చేయాలని అన్నారు.జిల్లా ఉపా ధ్యక్షులు ఎం యేసురత్నం మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయులకు 30 శాతం ఇంటీరియర్ రిలీఫ్ ప్రకటించాలని,ఎయిడెడ్ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం కూడా అనుమతించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో చీరాల పట్టణ అధ్యక్షుడు రమణ రావు,ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్,ఆర్థిక కార్య దర్శి జీవీ సుబ్బారెడ్డి, జిల్లా కౌన్సిలర్ రమేష్, అసోసియేట్ అధ్యక్షులు ఆదిశేషు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రైతులు ఖరీఫ్ సీజనకు సంబంధించి నారుమడులు పోసిన సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మండల వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ వారికి వివరించారు. గురువారం ఆయన మండల పరిధిలోని ఆరేపల్లి తూర్పుపాలెం గ్రామాలలో వరి నారుమడులను పరిశీలించి అవలంబించవలసిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివ రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిని 10,12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలన్నారు. నీరు పెట్టడానికి తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని ఒక కిలో భాస్వరం ఒక కిలో పొటాషిచ్చే ఎరువులను దుక్కు లో వేయాలన్నారు. చలి ఎక్కువగా ఉండే ప్రాంతా లలో భాస్వరం రెట్టింపు వేయాలన్నారు. శిలీంద్ర నా సినితో శుద్ధిచేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. ఒక ఆకు పూర్తిగా పురివిప్పుకునే వరకు ఆరు తడులు ఇచ్చి ఆ తరువాత పలుచగా నీరు నిలవ కట్టాలన్నారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాములు జింక్ సెల్ఫి ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. విత్తిన పది రోజులకు కార్బో ఫ్యూరిన్ 3జి గుళికలు సెంటునారుమడికి 160 గ్రాములు చొప్పున లేదా మోనోక్రోటోఫాస్ ఒకటి పాయింట్ 6 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.0 లీటర్ల నీటికి విత్తిన పది రోజులకు 17 రోజులకు మధ్య పిచికారి చేయాలన్నారు. నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 140 గ్రాములు కార్బోక్ యూరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి దాసరి మాధవి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాజీ సైనికుని సతీమణికి నివాళులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మాజీ సైనికుడు చలి కొండ వెంకటకృష్ణారావు సతీమణి కృష్ణా దేవి పెద్ద ఖర్మలో మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, మాజీ సైనికులు పాల్గొని నివాళులు అర్పించారు. బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలో గురువారం జరిగిన కృష్ణాదేవి పెద్ద ఖర్మ లో పాల్గొని వారి చిత్ర పటానికి పులమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆదిశేష రెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షు లు సుంకర శేషగిరిరావు, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గారావు, డి. వెంకటేశ్వర్లు, రుక్మనందరావు, నాగేశ్వరరావు, బక్కా రామకృష్ణారెడ్డి, కె ఆంజనేయులు, పసుపులేటి ప్రసాద్, పి రాధా కృష్ణమూర్తి, పోతురాజు, బసివి రెడ్డి, లుక్కా మదన్ మోహన్‌రావు, ఆదే కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాల శివలక్ష్మికి డాక్టరేట్



విశాలాంధ్ర - బాపట్ల : నంది రాజుతోట గ్రామానికి చెందిన ఆంగ్లం ఉపా ధ్యాయిని ఉప్పాల శివలక్ష్మికి తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టొ రేట్‌ను ప్రధానం చేశారు. వర్సిటీ ఆచార్యులు పి.రేణుక మార్గదర్శకత్వంలో స్టడీ హ్యాబిట్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ ఇంట్రెస్ట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య జీవనజ్యోతి వెల్లడించారు. జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో పలు పరి శో ధన పత్రాలను సమర్పించి వివరించారు. డా క్టరేట్ అందుకున్న శివలక్ష్మిని నందిరాజు తోట గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

పొగాకు విక్రయాలకు అనుమతి

అధికారి జి. సునీల్ కుమార్

విశాలాంధ్ర-మద్దిపూడి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో 2023-24 పంట కాలానికి సంబంధించి అధిక పొగాకు ఉత్పత్తి విక్రయాలకు సంబంధించి అనుమతి లభించినట్లు వేలం కేంద్రం అధికారి జి సునీల్ కుమార్ గురువారం తెలిపారు. ఈ సంవత్సరం అధిక పొగాకు పంట విక్రయాలపై ఎటువంటి అపరాధ రుసుము లేదని కేవలం సాధారణ , చార్జీలు మాత్రమే వర్తిస్తాయి అని తెలిపారు. కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని మద్దిపూడి మండలంలోని వివిధ గ్రామాల్లోని పొగాకు రైతులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనంగా రైతులు వద్ద ఉన్న పొగాకు అమ్మకాల కోసం వారి వద్ద ఉన్న పొగాకు వివరాలను సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లకు అందించాలని తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి రైతులు పొగాకు బోర్డు నందు సమర్పించాలని తెలిపారు. రైతులు తప్పనిసరిగా తమ పొగాకును బోర్డు లోనే అమ్ముకోవాలని ఎటువంటి అక్రమ అమ్మకాలు చేయకూడదని సూచించారు.

రేపటి నుంచి భావపురి విద్యాసంస్థల్లో

టెట్,డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కరపత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర – బాపట్ల : ఈ నెల 27 నుండి వచ్చే నెల 1 వ తేదీ వరకు 6 రోజులు ఏపీ టెట్,డీఎస్సీ అభ్యర్థులకు బాపట్ల శ్రీ భావపురి విద్యాసంస్థల్లో ఉచిత అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లో గురువారం శిక్షణ కరపత్రాలను కలెక్టర్ వెంకట మురళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ పబ్లికేషన్స్ ఫ్యాకల్టీ సతీష్ ఇంగ్లీష్ మెథడాలజీపై రెండు రోజు శిక్షణ ఇస్తారని తెలిపారు. అదేవిధంగా, శ్రీ అనూ పబ్లికేషన్స్ రచయిత దేవేందర్ చే ట్రై మెథడ్స్ , హైదరాబాద్ రామయ్య అకాడమీ అవనిగడ్డ స్టేట్ సీనియర్ ఫ్యాకల్టీ నరసింహారావుచే సైకాలజీ పెడగాగి ఆధ్వర్యంలో రెండు రోజుల చొప్పున శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలోని టెట్ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులకు హాజరై సబ్జెక్ట్ నిపుణులందించే విలువైన సబ్జెక్ట్ ను, వివిధ క్లిష్టమైన మెథడ్స్‌ను, సూచనలను పాటించి, మంచి మార్కులు పొందవచ్చని తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న శ్రీ భావపురి విద్యాసంస్థలు ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు ఫ్యాకల్టీ సభ్యులను కలెక్టర్ జె వెంకట మురళి ప్రోత్సహించారు.జిల్లాలోని బీసీ, ఎస్సీ,ఎస్టీ, ఈడబ్ల్యుఎస్ ఎకనామికల్ వీకర్ సెక్షన్ అభ్యర్థులందరికి ఆరు రోజులతో పాటు, రాబోయే 60 రోజుల ఎపి టెట్, డీఎస్సీ అభ్యర్థులందరికి ఉచితంగా శిక్షణ బాపట్ల శ్రీ భావపురి విద్యాసంస్థలు సందు అందించడానికి ప్రభుత్వం నుండి సహకారం కోరుతూ వినతిపత్రాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ కు అందజేయగా పరిశీలించి, పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణకు సహకరిస్తామని కలెక్టర్ అన్నారు. అనంతరం కలెక్టర్ జె వెంకట మురళి ని శ్రీ భావపురి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిడుగు బాలకోటేశ్వరరావు, దాసరి చిన భూషణం, అంజనేయ ప్రసాద్, నాలి సందీప్ , కిన్నెర భాస్కర్ రావు, యం సందీప్ కలసి శాలువాతో పుష్ప గుచ్చాలతో సన్మానించారు.

కార్గిల్ విజయోత్సవానికి 25 ఏళ్లు

యుద్ధంలో పాల్గొని వీరమరణం పొందిన చందోలు గ్రామ జవాన్ హాజీబాషా

విశాలాంధ్ర – బాపట్ల : బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం చందోలుకు జవాన్ల గ్రామంగా తొలి నుంచి పేరుంది. రెండవ ప్రపంచ యుద్ధం నుంచి ఈ గ్రామానికి సైనిక రంగంలో మంచి గుర్తింపు ఉంది. రక్షణ శాఖలో పలు కీలక స్థానాల్లో చందోలు గ్రామానికి చెందిన వారు పని చేస్తున్నారు. 16 మంది చందోలు యువకులు కార్గిల్లో ప్రాణాలకు తెగించి పోరాడి వారిలో వీర మరణం పొందిన తొలి యువకుడు హాజీ బాషా.

– చెరుకుపల్లి మండలం కావూరు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న హాజీబాషాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే చాలా ఇష్టం మంచి ప్రతిభ చూపేవాడు. క్రికెట్ కూడా బాగా ఆడేవాడు. 1993లో ఆర్మీలో చేరాక అతడు తన ఉద్యోగాన్ని చూసుకొని ఎంతో సంతోషించేవాడు. సైనికుడిగా పని చేయడం కష్టమైన పనే అయినప్పటికీ దేశసేవ చేసే అవకాశం అందరికీ దొరకదని చెప్పేవాడు. చిన్న వయసులో ఎంతో సాహసం ప్రదర్శించి ప్రాణాలర్పించిన హాజీబాషాని చూసి చందోలు గ్రామమంతా గర్వపడుతోంది.

– రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న హాజీబాషా తండ్రి హాజీ మస్తాన్ 17 సంవత్సరాల పాటు భారత సైనిక జవానుగా పని చేసిన నాకు భారతదేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టేంత అదృష్టం కలగలేదని చెప్పేవారు. కానీ ఒక్కగానొక్క బిడ్డ ఆ పని చేశాడని జాతి కోసం ప్రాణాలర్పించిన హాజీబాషాను చూసి గ్రామమంతా గర్వపడుతున్నామని మాజీ సైనికుడు షేక్ అబ్దుల్ రహమాన్ చెపుతున్నారు. ఆ కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే – జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలో మరికొన్ని సరిహద్దుల వద్ద జరిగింది. ఈ యుద్ధానికి కారణం పాకిస్తాన్ సైనికులు, కాశ్మీరీ తీవ్రవాదులు నియంత్రణ రేఖ దాటి భారతదేశంలోకి చొరబడడం. యుద్ధ ప్రారంభ దశలో పాకిస్తాన్ ఇది కాశ్మీరీ తిరుగుబాటుదారులు చేస్తున్న యుద్ధంగా పేర్కొన్నప్పటికీ యుద్ధంలో మరణించిన వారి దగ్గర లభించిన ఆధారాలను బట్టి, తర్వాత పాకిస్తాన్ ప్రధానమంత్రి, సైన్యాధిపతులు చేసిన వ్యాఖ్యలను ఇందులో పాకిస్తాన్ సైనిక దళాల హస్తం ఉందని రుజువయ్యింది. నియంత్రణరేఖ దాటి పాకిస్తాన్ ఆక్రమించుకున్న ప్రదేశాలను భారత సైన్యం, భారతీయ వాయుసేన సహకారంతో తిరిగి స్వాధీనపరుచుకుంది. అంతర్జాతీయంగా వస్తున్న వత్తిడిని తట్టుకోలేక పాకిస్తాన్ సైన్యం వెనుతిరిగింది. ఎత్తైన పర్వత ప్రాంతాల మీద జరిగిన యుద్ధాలకి ఇది తాజా ఉదాహరణ. ఇంత ఎత్తులో యుద్ధం జరగడం వల్ల ఇరు పక్షాలకి ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. విజయోత్సవ కార్గిల్ యుద్ధంలో చందోలుకు చెందిన జవాన్ హాజీ బాషా వీరమరణం పొందటం గ్రామ ఖ్యాతికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం కార్గిల్ విజయోత్సవ దినోత్సవం సందర్భంగా గ్రామస్తులు హాజీబాషా వీర మరణాన్ని నెమరవేసుకుంటున్నారు.

కార్గిల్‌యుద్ధంలో

భారత సైనికుల శౌర్యానికి ప్రతీక విజయ్‌దివస్

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : దేశం యావత్తు గర్వించదగిన కార్గిల్ విజయ దివస్ కార్గిల్ యుద్ధం జరిగి నేటికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాతృభూమి సేవలో ధైర్యంగా పోరాడిన కార్గిల్ వీరులకు మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. బాపట్ల పట్టణంలోని చీలురోడ్డు సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు మాజీ సైనికులు బీజెపి నాయకులతో కలిసి కాగడాల ర్యాలీ నిర్వహించారు.కార్గిల్ యుద్ధంలో సైనికులు, సాయుధ దళాలు ప్రాణా లకి తెగించి పోరాడి విజయం సా ధించిన అందుకు గౌరవార్థం ర్యాలీ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ విజయ్ దివస్, లేదా కార్గిల్ విక్టరీ డే, 1999 పాకిస్తాన్‌తో జరిగిన పోరాటంలో భారతదేశం సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 25న జరుపుకుంటారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం నుండి 527 మంది సైనికులు మర ణించారని ఈ వివాదం జూలై 26, 1999న ముగిసిందన్నారు. పాకి స్తాన్ సైన్యం వారి ఆక్రమిత స్థానాల నుండి వెనక్కి వెళ్ళవలసి వచ్చిందని ఇది భారతదేశ విజయాన్ని సూచి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా యువమోర్చ అధ్యక్షులు నాశన మణి కుమార్, బొడ్డు కృష్ణ చైతన్య, మామిడి రమేష్ బాబు, స్టేట్ ట్రెజరర్ కృష్ణ చైతన్య శర్మ, కృష్ణ చైతన్య, బాపట్ల మాజీ సైనిక అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు కూటమి నాయకులు ఉప్పాల మురళి గౌడ్‌లు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర – చీరాల : విద్యార్థులు భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల పట్ల అవగాహన ఏర్పరచుకోవాలని ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ రాజు అన్నారు.గురువారం శిక్షా సప్తాహ్ నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా పేరాల ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూల్లో సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సాల్మన్ రాజు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం అనే మన ప్రాథమిక సూత్రాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు.వివిధ భాషలు,మతాలు, సాంప్రదాయాలు, సంస్కృతులు కలిగిన భారతీయులు అందరూ ఒక్కటే (ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్) అనే విషయాన్ని గుర్తించాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విలువైన రాజకీయాలు జనసేనతోనే సాధ్యం

విశాలాంధ్ర – చీరాల : నియోజకవర్గంలో పదివేలమంది కార్యకర్తలను నమోదు చెయ్యడమే లక్ష్యమని,యువత విలువైన రాజకీయాలు చూడాలంటే జనసేనలో చేరాలని జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్ అన్నారు.జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ప్రసాద్ థియేటర్ సెంటర్లో అనుమకొండ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గూడూరు శివరామ ప్రసాద్ మాట్లాడుతూ జులై 18 నుంచి 28తేదీ వరకు జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని,జనసేన పార్టీలో క్రియాశీల సభ్యులుగా చేరాలనుకునేవారు 28వ తేదీల లోపు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.విలువైన రాజకీయాలు జనసేనతోనే సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ కిషోర్,మామిడాల శ్రీనివాసరావు, 25వ వార్డు జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎరిచర్ల అశోక్ కుమార్, ప్రోగ్రాం కమిటీ మెంబర్ పాలవలస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర – రేపల్లె : రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ పిలుపు మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు ,సయ్యద్ తాహిర్ అహ్మద్‌లు రేపల్లె పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు తమ వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేనియెడల జరిగే అనర్థాలు గురించి వాహనదారులకు వివరించారు. హెల్మెట్ లేకపోతే జరుగుతున్న ప్రమాదాలు ప్రతిరోజు దినపత్రికల్లో, టీవీ ఛానల్లో చూస్తున్నామని, ప్రమాదం జరిగినప్పుడు తలకు దెబ్బ తగిలితే వెంటనే చనిపోతున్న సందర్భాలు ప్రతిరోజు చూస్తున్నామని వివరించారు .ఈ కార్యక్రమంలో మండల పారా లీగల్ వాలంటీర్లు తోపాటు పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ ఎడ్లపల్లి కిషోర్, బాబు వాహనదారులు పాల్గొన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - బాపట్ల : వెదుళ్ళపల్లి సమీపంలోని జి.బి.సి రోడ్డు ప్రక్కన వంతెన దగ్గర ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి. అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు ప్రత్యేకమైన హాస్టల్ ఉందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారు పాఠశాలలో ప్రవేశానికి అర్హులన్నారు. 1వ తరగతిలో చేరేందుకు 6 సంవత్సరాల నుంచి 8 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. బదిలి సర్టిఫికేట్ అన్ని తరగతులకు ప్రవేశం ఉందన్నారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికేట్, పాఠశాల బదిలీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీతో తమ పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఉచిత విద్య, హాస్టల్, భోజనంతో పాటు ప్రభుత్వం కల్పించే అన్ని రకాల సదుపాయాలు ఉచితంగా కల్పిస్తున్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, అత్యాధునిక సంకేతిక పరిజ్ఞానంతో చదువు నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల బధిర (మూగ, చెవిటి) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నెంబర్లు 9000013633 లేదా 9493447237 లను సంప్రదించాలన్నారు.

ఢిల్లీ జగన్ దీక్షలో చల్లా రామయ్య

విశాలాంధ్ర - బాపట్ల : ఢిల్లీలో వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన దీక్షకు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య పాల్గొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దౌర్జన్యాలు, హత్యలకు నిరసనగా చేపట్టిన దీక్షకు బాపట్ల నుంచి చల్లా రామయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ దురంహంకార విధానాలపై పోరాటం చేయనున్నట&అఉల తెలిపారు. ఆయనతో పాటు నల్లమోతువారిపాలెం సర్పంచ్ మాడా సుబ్రమణ్యం, వైసీపీ నాయకులు పిన్నిబోయిన సుందర్ సింగ్, పెదదగొల్ల పాలెం సర్పంచ్ యల్లావుల సురేష్ రాదవ్ ఉన్నారు.

కూటమి శ్రేణులకు సత్కారం

విశాలాంధ్ర-కొల్లూరు : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఘన విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో కొల్లూరు మండలంకు చెందిన కూటమి శ్రేణులు కొల్లూరు నుంచి తిరుమల వరకు పాదయాత్ర చేపట్టి దిగ్విజయంగా ముగించుకున్న నేపథ్యంలో స్థానిక నాయకులు పాదయాత్ర చేసిన వారిని ఘనంగా సత్కరించారు. గురువారం కొల్లూరులోని కాకతీయ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర తలపెట్టిన మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్, ఇతర నాయకులు, కార్యకర్తలను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అవినీతికి తార్కాణంగా నిలిచిందని, కూటమి ప్రభుత్వం తిరిగి రాష్ట్రాన్ని ప్రగతి మార్గంలోకి తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, బొదలపాటి చలమయ్య పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ర్యాలీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా యువ మోర్చా అధ్యక్షులు మైలా హరికృష్ణ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో కాగడాల ప్రదర్శన, 75 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర కుమార్, జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు, పాటిబండ్ల రామకృష్ణ, నవనీత్ కృష్ణా రెడ్డి, శ్రీనాద్, అశోక్ రెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, యశ్వంత్, సమత, బాలకొటయ్య, గోపి, ఫణి కృష్ణ, జాబిలి శ్రీనివాస్, ఈశ్వర్ గౌడ్, తిరుపతి ప్రభుదాస్, నాగ గోపి, నాని, రాజా, గంగాధర్, జంధ్యాల రామలింగ శాస్త్రి, పద్మనాభం, వరికూటి వీర సుధాకర్, అప్పిశెట్టి రంగా, రామకృష్ణ, బిలాల్, కోలా రేణుక దేవి, లాలా స్వాతి, షేక్ సాంబశివరావు, లంక రవి, సురేష్ జైన్, మాదల సురేష్, తదుపై రామకృష్ణ, దారా అంబేద్కర్, జితేంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు అరెస్టు

టంగుటూరు పోలీసు స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదు

విశాలాంధ్ర-టంగుటూరు : మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వాలు కఠినతరమైన చట్టాలు అమలు చేసి శిక్షలు విధిస్తున్నప్పటికీ మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి. నిత్యం ఎక్కడో చోట మహిళలపై లైంగిక దాడులు నిత్య కృత్యమవుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా మృగాళ్ల చేతుల్లో మహిళలు లైంగిక దాడులకు గురై బుగ్గిపాలవుతున్నారు. తాజాగా టంగుటూరులో పదో తరగతి చదువుతున్న బాలికను లైంగిక దాడి చేసిన కామాంధుడిని టంగుటూరు పోలీసులు అరెస్టు చేసి ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. స్థానిక టంగుటూరు పోలీస్ స్టేషన్లో కనిగిరి డిఎస్పీ రామరాజు కేసు వివరాలను వెల్లడించారు. బాలిక పాఠశాలకు వెళ్లేటప్పుడు వాణి నగర్‌కు చెందిన ఇత్తడి విజయ్‌కుమార్ ఇంటికి టీవీ చూడడానికి వస్తు ఉండేది. విజయ్ కుమార్ ఎవరూ చూడని సమయం చూసుకొని బాలికతో మాటలు కలిపి అప్పుడప్పుడు తన ఇంటిలోకి తీసుకువెళ్లి టీవీలో తనకు ఇష్టమైన చానల్స్‌ను చూపిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తాను టీవీలో లీలమై ఉండగా ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉండేవాడు. టీవీ చూపిస్తూ మభ్యపెట్టి లొంగదీసుకుని ఆమెపై పలుమార్లు లైంగిక దాడి చేసేవాడు. ఆ బాలిక కుటుంబం విజయ్ కుమార్‌కు బాగా తెలుసు కాబట్టి ఎవరికి చెప్పొద్దు అని బాలికను బెదిరించాడు. ఈనెల 22వ తేదీ బాలికను విజయకుమార్ తన ఇంటికి పిలిపించుకుని ఆమెపై దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ప్రకాశం జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ కనిగిరి డిఎస్పి రామరాజు ఆధ్వర్యంలో సింగరాయకొండ సిఐ డి రంగనాథ్ టంగుటూరు ఎస్సై పున్నారావులను లోతైన దర్యాప్తు జరిపి నిందితులకు శిక్ష పడేలా చేయాలని ఆదేశించారు.

ఈ క్ర మంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులకు గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో టంగుటూరు ఉత్తరం వైపున జాతీయ రహదారిపై నిందితు డు విజయ్ కుమార్ ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ రామరాజు మాట్లాడుతూ బాలికపై అత్యాచారం చేసిన ఇత్తడి విజయ్ కుమార్‌ను ఫోక్సో చట్టం కింద అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డిఎస్పీ రామరాజు సింగరాయకొండ సిఐ డి రంగనాథ్ టంగుటూరు ఎస్సై పున్నారావు మరియు టంగుటూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయండి

కలెక్టర్‌కు సీపీఐ సీనియర్ నాయకులు టీసీఎచ్ చెన్నయ్య వినతి పత్రం అందజేత

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు యర్రగొండ పాలెం నియోజకవర్గ సీపీఐ సీనియర్ నాయకులు టిసిఎచ్ చెన్నయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం తీవ్రమైన కరువు కోరల్లో చిక్కుకొని ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పశ్చిమ ప్రాంతంలో వెయ్యి అడుగులు బోరుబావి తవ్వినా చుక్క నీరు పడటం లేదని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అయితే ఈ ప్రాంతానికి త్రాగు, సాగు నీరు అందుతాయని తెలిపారు. తమరు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కొద్ది రోజులలో నిర్ణయించే తాత్కాలిక బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించే విధంగా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సుదర్శన క్రియతో సంపూర్ణ ఆరోగ్యం

కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ మాలకొండమ్మ

విశాలాంధ్ర-రాచర్ల : మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల నందు మూడు రోజుల నుండి జరిగిన యోగా శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాలకొండమ్మ మాట్లాడుతూ మా కస్తూరిబా గాంధీ పాఠశాల నందు యూత్ ఎంపవర్మెంట్ సెమినార్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. శ్వాస ప్రక్రియలు సుదర్శన క్రియ భస్త్రిక ప్రాణాయామము సూక్ష్మ ప్రాణాయామా లతో విద్యార్థినులు వ్యక్తిగత సమస్యల నుండి కూడా ఒత్తిడిని అధిగమించి రాబోవు రోజులలో పబ్లిక్ పరీక్షలలో కూడా ధైర్యంగా ప్రశాంతమైన స్థితి కల్పించే యోగా శిక్షణ చేపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు సాయికిరణ్ బిందు పాలుగుళ్ల పురుషోత్తం రెడ్డి మనోహర్ రెడ్డి విద్యార్థినిలు సంబంధిత నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఎంపీడీవో మృతి బాధాకరం

పీసీపల్లి ఎంపీడీవో వెంకట సుబ్బారావు

విశాలాంధ్ర-పిసిపల్లి : నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ మృతి చెందటం బాధాకరమని ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నర్సాపురం ఎంపీడీవో ఆత్మహత్యకు కారకలైన వ్యక్తులు పట్ల దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సంజీవి శ్రీనివాసులు అసిస్టెంట్ ఇంజనీర్ గ్రామీణ నీటి సరఫరా పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బాల వీరాంజనేయ స్వామిని కలిసిన ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : అమరావతి సచివాలయంలోని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వర్యులు బాల వీరాంజనేయ స్వామిని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో బాలికల, బాలుర సంక్షేమ హాస్టళ్ల విషయంలో కావాల్సిన అదనపు భవనాలు, మరమ్మతులకు త్వరగతిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మరమ్మతులను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

భూసమస్యను పరిష్కరించాలని
కలెక్టర్‌కు వృద్ధురాలు విజ్ఞప్తి

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మండలం, నల్లూరు నార్త్ గ్రామానికి చెందిన మోటూరు రంగ నాయకమ్మ తమ భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వెంకట మురళి ,రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి హేలా షారోన్‌లకు వినతి పత్రాలు అందచేశామని ఆమె తెలిపారు. భూమికి సంబంధించి సీతారామయ్య ,లోకేశ్వరరావు, వెంకటేశ్వరరావులు మనమళ్ళు రాజ కిషోర్, రవీంద్రనాథ్, రావా లసినవి పంచకుండా విక్రయించినారని తెలిపారు. నా భూమికి పట్టా దారు పాస్ పుస్తకం ఇప్పించి భూ సమస్య పరిష్కరించి న్యాయం చేయమని కోరుతూ వినతి పత్రాలు అందజేసినట్లు మోటూరు రంగనాయకమ్మ తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల : ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థికలేమి అడ్డంకి కాకూడదని ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ ఎడిటర్ ఇస్త్రర్ల సుభాషిణి, బాబూరావులు అన్నారు. గురువారం చీరాల రోటరీ కమ్యూనిటీహాలులో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్త అనే విద్యార్థినికి చదువు కోసం పది వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఇస్త్రార్ల బాబురావు, సుభాషిణిలు మాట్లాడుతూ విద్య ద్వారానే ఉన్నత స్థాయికి ఎదగగలమని ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు వెనుక బడకూడదన్నారు. సంయుక్త ఉన్నత స్థితికి ఎదగాలని బాగా చదివి మరికొందరికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఇంటర్‌లో 980 మార్కులు సాధించి, బీహార్ పాట్నాలో ఇండియన్ ఇనిస్టిట్యూట ఆఫ్ టెక్నాలజీలో సీటు సంపాదించిన బొగిరెడ్డి సంయుక్త ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ భానుకుమారి, లలిత, నళిని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ సభలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని రామకృష్ణాపురం గ్రామ పంచాయితీలో ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ బందారు మురళీ బాపూజీ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కాల కృత్యాలు తీర్చుకోవడం కోసం బహిర్భూమికి కాకుండా ఇంటిలోనే మరుగు దొడ్డిని నిర్మించుకోవాలన్నారు. పథకాల ద్వారా ప్రభుత్వం వీటిని నిర్మించి ఇస్తుందని తెలిపారు. రక్షిత మంచినీటి సరఫరా కోసం ప్రతి ఇంటికి కుళాయి మంజూరు చేస్తుందని అన్నారు. అవసరమైన వారు గ్రామ పంచాయతీలోని నిర్దేశిత అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని సాల్మన్ సెంటర్, విజయనగర్ కాలనీ, తోటవారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయితీ లలో గ్రామస్థులతో ఓడీఎఫ్, హర్ ఘర్ జల్ లపై గ్రామసభలు నిర్వహించారు. దీంతో ఈ నెల 23 వ తేదీ నుండి మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న గ్రామసభలు ముగిశాయి.

జనసేన సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గి బుడగజంగాల కాలనీలో గురువారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు విజయవంతంగా జరిగిందని ఆ పార్టీ గ్రామ అధ్యక్షులు రుద్రాల రవి తెలిపారు. కాలనీవాసులు మహిళలు, యువకులు సభ్యత్వం చేయించుకోవడానికి ముందుకొచ్చారు. పార్టీ శ్రేణులు సూరె సుబ్రహ్మణ్యం, సూరె సుధీర్, కోరే నాగరాజు, బుడగజంగాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, కప్పెర చిన్న నాగేశ్వరరావు, రేవల్లి అల్లూరయ్య, రేవల్లి సైదులు తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం ఏది..?

- ◈ మౌంట్‌పోర్ట్ రోడ్డు కిరువైపులా చెత్తాచెదారం
- ◈ విద్యార్థులు, తల్లిదండ్రులు పలు ఇబ్బందులు
- ◈ సమస్యను పరిష్కరించని మున్సిపల్ అధికారులు,పాలకులు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని 25,26 వార్డుల్లో హిందూ స్మశాన వాటికకు పక్కనే మున్సిపల్ డంపింగ్ యార్డు కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూ ఉంది. అయితే డంపింగ్ యార్డు పూర్తిగా నిండిపోవడంతో పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో నిండిపోవడంతో పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు పలు సమస్యలకు గురవుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా పడవేస్తూ ఉండడంతో ఇదే మార్గంలో ఉన్న మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, తల్లి దండ్రులు సమీప వార్డులోని నిర్వాసితులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డంపింగ్ యార్డు నుండి వస్తున్న దుర్వాసనతో విద్యార్థులు ,తల్లిదండ్రులు సమీప మున్సిపల్ వార్డుల్లో నివసిస్తున్న ప్రజలు పలు అంటూ వ్యాధులకు గురవుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు.

డంపింగ్ యార్డును ఇక్కడ నుండి వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ మౌంట్‌ఫోర్ట్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్కూలు యాజమాన్యం 25,26 వార్డుల ప్రజలు హైకోర్టులో మున్సిపల్ అధికారులపై పిటిషన్ దాఖలు చేశారు. చాలాకాలంగా ఈ కేసు జరుగుతున్నప్పటికీ నేటి వరకు రేపల్లె కోర్టులో కూడా ఒక కొలిక్కి రాకపోవడంతో పట్నంలో సేకరించిన చెత్త చెత్తను పారిశుధ్య కార్మికులు, ట్రాక్టర్ల ద్వారా తీసుకు వెళ్లి డంపింగ్ యార్డులో పడవేస్తున్నారు. డంపింగ్ యార్డు నిండిపోవడంతో ప్రక్కన రోడ్డుపైన ఇరువైపులా ఈ చెత్తను పడవేయటంతో అది కుళ్ళిపోయి భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నదని అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆయా వార్డులలో నివసించే పలువురు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. డంపింగ్ యార్డులో వేయవలసిన చెత్తను రోడ్లపై పోయటంతో స్కూలుకు వచ్చి వెళ్లే వారికి ఇదే మార్గంలో వెళ్లే వాహనదారులకు పలు సమస్యలకు గురవుతున్నామని, వెంటనే మున్సిపల్ అధికారులు, తగు చర్యలు తీసుకొని డంపింగ్ యార్డులో ఉన్న ఖాళీ స్థలంలోనే చెత్తా చెదారాన్ని వేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

టైక్వాండోలో టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర స్థాయి టైక్వాండో జూనియర్, సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. స్కూల్ పి.ఈ.టి కె. మోహన్ మాస్టర్ సారథ్యంలో అనతి కాలంలో విద్యార్థులకు శిక్షణనిచ్చి పోటీలలో పాల్గొన్న టెక్నో స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఐదు కాంస్య పతకాలను టెక్నో స్కూల్‌కు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు అభి నందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువు ఎంత అవసరమో శరీరక ధారుఢ్యం పెంచుకోవడం అంతే ముఖ్యమన్నారు. పాఠశాలలో త్వరలో విద్యా ర్థులకు స్విమ్మింగ్ నేర్పేందుకు పూల్ ఏర్పాటు చేస్తున్నామని ఆమె అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసిన విధంగా ఆరోగ్యం అంటే కేవలం శారీరక ఆరోగ్యం కాదని ఒక వ్యక్తి శారీ రకంగా మానసికంగా సామాజికంగా ఏ విధమైన రుగ్మతలు లేకుండా పరిపూర్ణమైనటువంటి స్థితిలో ఉన్నప్పుడే ఆరోగ్యవంతులవుతారన్నారు. అధ్యాప కులతో పాటుగా ఉత్తమమైన పిఈటిని కూడా తమ ఎస్.ఎన్.బి.టి.యం. టెక్నో స్కూల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ స్కూల్లో విద్యా బోధనతో పాటుగా శరీరక దారుఢ్యాన్ని కలిగించే క్రీడలకు కూడా అంతటి ప్రాధాన్యతను ఇవ్వటం జరుగుతుందని అంతేకాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు భరతనాట్యం, నాటికలు, ఇతర కళలలో విద్యార్థిని విద్యార్థులకు అవకాశాలను కూడా కల్పించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలి యజేశారు. పతకాలు సాధించిన విద్యార్థిని విద్యా ర్థులు ఏ.రఘువర్ధన్, ఏ.యశస్వి, అడుసుమల్లి అక్షర , యన్. షెల్లా గ్రేస్ వ్యాయామ ఉపాధ్యా యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రదేశాలు పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రధాన ప్రాంతాలలో సీసీ కెమెరాలు పెట్టేందుకు ప్రదేశాలను పట్టణ సిఐ యు శ్రీనివాసులు పరిశీలించారు. హింసాత్మక సంఘటనలు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయని వాటిని కట్టడి చేసే విషయాలలో పోలీసుల భాధ్యతతో పాటు సీసీ కెమెరాలు నిర్వహణ ముఖ్యమని సిఐ యు శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేరాల ని యంత్రణ, ఎక్కడ నేరం జరిగిన పోలీసులు తక్షణమే నిందితులను గుర్తించటం జరుగు తుందని నిందితుల కదలికలు సి సి కెమెరాలు ఉండటం వలననే గుర్తించడం జరుగుతుందన్నారు.

డయేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మండలం అడవిపల్లెపాలెం గ్రామ పంచాయతీ పాండురంగాపురంలో గురువారం గ్రామీణ మంచినీటి సరఫరా పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాప్ డయేరియా కార్యక్రమానికి ఇంచార్జీ డీఎల్పీవో పులి శరత్ బాబు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలోని ప్రజలందరూ పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలని, కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితం కాకుండా గ్రామపంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. తినే ఆహార పదార్థాల విషయంలో కూడా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటే డయేరియా లాంటి వ్యాధులను అరికట్టవచ్చునని శరత్ బాబు అన్నారు. ఆర్ డబ్ల్యూ ఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ భాష ఆధ్వర్యంలో మంచి నీటి పరీక్షలను గ్రామంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు

డయేరియా పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆరోగ్య శాఖ సిబ్బంది వివరించారు. అనంతరం గ్రామంలో డయేరియా పట్ల జాగ్రత్తల గురించి చైతన్య పరుస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి. కిరణ్ కుమార్, ఎం.ఆర్.సి శశి కిరణ్, పంచాయితీ కార్యదర్శి బి.రాజశేఖర్, అంగన్వాడి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.